# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 12-03-2026 సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ వ్యవసాయ రంగంలో మహిళల పాత్ర మరింతగా విస్తరించాలని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆకాంక్షించారు.
- ❖ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రేపు గువాహతి నుండి పీఎం కిసాన్ సమ్మాన్ నిధి 22వ వాయిదాను విడుదల చేయనున్నారు.
- ❖ దేశంలో ఇంధన కొరత లేదని పెట్రోలియం సహజ వాయువు శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పూరి లోక్‌సభలో స్పష్టం చేశారు.
- ❖ ఇరాన్‌తో భారత్ ఇంధన భద్రతకు సంబంధించిన అంశాలపై చర్చలు జరుపుతోందని విదేశాంగ మంత్రిత్వ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = = = = =

వ్యవసాయ రంగంలో మహిళల పాత్ర మరింతగా విస్తరించాలని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆకాంక్షించారు. వ్యవసాయ-ఆహార వ్యవస్థలలో మహిళల పాత్రపై ప్రపంచ సదస్సు-2026ను న్యూఢిల్లీలో రాష్ట్రపతి ఈ రోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... వ్యవసాయ రంగంలో మహిళలు విధాన రూపకర్తలుగా మారాలని, నాయకత్వ పాత్ర పోషించాలని కోరారు. మహిళల భాగస్వామ్యం సమ్మిళిత వ్యవసాయ వృద్ధిని ప్రోత్సహిస్తుందని పేర్కొన్నారు. వ్యవసాయంతో పాటుగా ప్రతి రంగంలోనూ లింగ సమానత్వాన్ని సమర్థవంతంగా అమలు చేయడం ద్వారానే ప్రగతి సుసాధ్యమని రాష్ట్రపతి తెలియజేస్తూ...

(వాయిస్ 28 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అస్సాంలోని గువాహతిలో రేపు జరిగే ఓ కార్యక్రమంలో పీఎం కిసాన్ సమ్మాన్ నిధి 22వ వాయిదాను విడుదల చేయనున్నారు. కేంద్ర వ్యవసాయం, రైతు సంక్షేమ శాఖా మంత్రి శివరాజ్ సింగ్

చౌహాన్ న్యూఢిల్లీలో పాత్రికేయులతో ఈ రోజు మాట్లాడుతూ ఈ విషయాన్ని తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దాదాపు 9 కోట్ల 32 లక్షల మంది రైతుల బ్యాంకు ఖాతాలకు ప్రత్యక్ష నగదు బదిలీ ద్వారా 18 వేల 640 కోట్ల రూపాయలను విడుదల చేస్తారని ఆయన పేర్కొన్నారు. ఈ పథకం కింద ఇప్పటివరకు 4 లక్షల 9 వేల కోట్ల రూపాయలకు పైగా నగదు మొత్తాన్ని రైతుల ఖాతాలలో వేశామని కేంద్రమంత్రి తెలిపారు. ఇదిలా ఉండగా.. దేశంలో మొత్తం ఆహార ధాన్యాల ఉత్పత్తి 2014లో 252 మిలియన్ టన్నుల నుండి 2025 నాటికి దాదాపు 357 మిలియన్ టన్నులకు పెరిగిందని కేంద్రమంత్రి చెప్పారు. ఉద్యానవన పంటల ఉత్పత్తి 277 మిలియన్ టన్నుల నుండి దాదాపు 369 మిలియన్ టన్నులకు పెరిగిందని పేర్కొన్నారు. ప్రభుత్వం కృత్రిమ మేధ ఆధారిత డిజిటల్ ప్లాట్‌ఫామ్, భారత్ విస్తార్ మొదటి దశను కూడా ప్రారంభించిందని శివరాజ్ సింగ్ చెప్పారు.

= = = = = = = = = = = = = = = = = = = = = =

దేశంలో ఇంధన కొరత లేదని కేంద్ర పెట్రోలియం, సహజ వాయువు శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పూరి స్పష్టం చేశారు. పశ్చిమాసియాలో కొనసాగుతున్న సంఘర్షణల కారణంగా ఇంధన సరఫరాకు ఏర్పడిన అంతరాయం.. ప్రభుత్వం తీసుకున్న చర్యల గురించి కేంద్రమంత్రి లోకసభలో ఈరోజు ఒక ప్రకటన చేశారు. ఇంధన వనరుల విషయంలో దేశం భద్రంగా ఉందని అన్నారు. దేశంలో పెట్రోల్, డీజిల్, ఏవియేషన్ టర్బైన్ ఇంధనానికి కొరత లేదని పేర్కొన్నారు. భారత్‌లో పేదలు, వెనుకబడిన వర్గాలకు నిరంతరాయంగా LPG సరఫరాను అందించడమే ప్రభుత్వ ప్రాధాన్యత అని వెల్లడించారు. భారతదేశం తన LPG అవసరాలలో దాదాపు 60 శాతం ఖతార్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, సౌదీ అరేబియా, కువైట్ వంటి గల్ఫ్ దేశాల నుండి దిగుమతి చేసుకుంటుండగా.. 40 శాతం దేశీయంగా ఉత్పత్తి చేస్తోందని హర్దీప్ సింగ్ పూరి వివరిస్తూ...

(వాయిస్ 31 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = =

నిబంధనల ప్రకారమే సభా కార్యకలాపాలు నడుస్తాయని లోకసభ స్పీకర్ ఓం బిర్లా పేర్కొన్నారు. తనపై ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం వీగిపోయిన నేపథ్యంలో ఆయన యథావిధిగా ఈ రోజు తన బాధ్యతలు చేపట్టారు. అవిశ్వాస తీర్మానం ప్రక్రియ పూర్తయ్యేవరకు సభకు హాజరుకాకూడదని స్పీకర్ నిర్ణయించుకున్నారు. లోక్ సభలో సభ్యులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ... ప్రతి ఎంపీకి లోకసభలో మాట్లాడే అవకాశం కల్పించడానికి తాను ఎల్లప్పుడూ ప్రయత్నిస్తానని అన్నారు. సభ నియమ నిబంధనలకు ఎవరూ అతీతులు కారని స్పష్టం చేశారు. ప్రధానమంత్రితో పాటు మంత్రులు సభలో ఏదైనా ప్రకటనలు చేయడానికి ముందు సభ నిబంధనల ప్రకారం నోటీసులు ఇవ్వాలని ఆయన పేర్కొన్నారు. సభ్యుల మైక్రోఫోన్లను నియంత్రించాననే ఆరోపణల్లో ఎలాంటి వాస్తవం లేదని స్పీకర్ అన్నారు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = =

దేశంలో ఇంధన భద్రతకు సంబంధించిన అంశాలపై భారత విదేశాంగ మంత్రి డాక్టర్ ఎస్. జైశంకర్.. ఇరాన్ విదేశాంగ మంత్రి సయ్యద్ అబ్బాస్ అరఘ్చితో చర్చించారని విదేశాంగ మంత్రిత్వ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ తెలిపారు. న్యూఢిల్లీలో పాత్రికేయులతో ఆయన ఈరోజు మాట్లాడుతూ... ఇద్దరు మంత్రులు ఇప్పటికే మూడు సార్లు ఈ అంశాల మీద చర్చలు జరిపారని అన్నారు. ఇరాన్‌లో దాదాపు 9 వేల మంది భారతీయులు ఉన్నారని, భారత ప్రభుత్వం టెహ్రాన్ నుండి అనేక మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించిందని ఆయన తెలియజేశారు. వివాదం ప్రారంభమైన తర్వాత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గల్ఫ్ ప్రాంతంలోని అనేక మంది నాయకులతో మాట్లాడారని ఆయన గుర్తు చేశారు. ఈ సందర్భంగా పశ్చిమాసియాలో శాంతి పునరుద్ధరణ అవసరాన్ని ప్రధానమంత్రి స్పష్టంగా చెప్పారని అన్నారు. అలాగే ప్రజల ప్రాణనష్టాన్ని నివారించాల్సిన అవసరాన్ని గురించి సూచించారని చెప్పారు.

= = = = = = = = = = = = = = = = = = = = = =

దేశంలో మౌలిక సదుపాయాల అభివృద్ధి, జాతీయ భద్రత విపత్తు నిర్వహణలో జియో స్పేషియల్ సాంకేతికత కీలకమైన పాత్ర పోషిస్తోందని కేంద్ర సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖా సహాయ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ అన్నారు. న్యూఢిల్లీలో జరిగిన జియోడ్‌కాన్-26 ప్రారంభ సమావేశంలో ఆయన ఈరోజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... గత దశాబ్దంలో భారతదేశంలో జియో స్పేషియల్ రంగం గణనీయమైన అభివృద్ధిని సాధించిందని చెప్పారు. సర్వే ఆఫ్ ఇండియా వంటి సంస్థల పునరుద్ధరణ నేషనల్ జియో స్పేషియల్ పాలసీ-2022 ప్రవేశపెట్టడం వల్ల జియో స్పేషియల్ డొమైన్‌లో నూతన ఆవిష్కరణలు, పరిశోధనలకు అవకాశాలు ఏర్పడ్డాయని గుర్తు చేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = =

పశ్చిమాసియా వివాదంపై విదేశాంగ మంత్రి డాక్టర్ ఎస్. జైశంకర్ ఇండోనేషియా విదేశాంగ మంత్రి సుగియోనోతో ఈరోజు చర్చలు జరిపారు. ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాల గురించి ఈ సందర్భంగా చర్చించామని, త్వరలోనే జాయింట్ కమిషన్ సమావేశాన్ని నిర్వహించడానికి అంగీకరించామని సామాజిక మాధ్యమం ద్వారా పెట్టిన పోస్టులో జైశంకర్ పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = =

కేంద్ర ఎన్నికల కమిషన్ ముగ్గురు సభ్యుల బృందం ఉత్తర త్రిపుర జిల్లాలోని ధర్మనగర్ లో ఈ రోజు పర్యటించింది. ఈ సందర్భంగా జిల్లా పరిపాలన పోలీసు ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహించింది. ఈ సమావేశంలో రాష్ట్ర ఎన్నికల శాఖ అధికారులు కూడా పాల్గొన్నారు. ధర్మనగర్ నియోజకవర్గంలో ఉప ఎన్నికకు అవసరమైన ఏర్పాట్లను ఈ బృందం సమీక్షించింది. ఎన్నికల కమిషన్ బృందంలో ప్రిన్సిపల్ సెక్రటరీ ఎస్.టి. భూటియా, కార్యదర్శి సంతోష్ కుమార్ దూబే, సెక్షన్ ఆఫీసర్ విజయ్ గుప్తా ఉన్నారు. గత సంవత్సరం డిసెంబర్ 26న త్రిపుర శాసనసభ స్పీకర్ బిశ్వబంధు సేన్ మరణించినప్పటి నుండి ఈ అసెంబ్లీ స్థానం ఖాళీగా ఉంది.

= = = = = = = = = = = = = = = = = = = = = =

చమురు ట్యాంకర్ తో ప్రయాణించిన భారతీయ నౌక ఇరాన్ దేశం మీదుగా సాగే హార్ముజ్ జలసంధిని సురక్షితంగా దాటి ముంబైకి చేరుకుంది. ఇటీవల ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ దేశాల దాడుల తర్వాత సముద్ర మార్గాన రాకపోకలు తగ్గిపోయాయి. ఈ నేపథ్యంలో హార్ముజ్ జలమార్గం మీదుగా ప్రయాణించి భారతదేశానికి చేరిన మొదటి నౌకగా దీనిని ముంబై పోర్ట్ అధికారులు పేర్కొన్నారు. ఈ నౌక లక్షా 35 వేల 335 మెట్రిక్ టన్నుల ముడి చమురును తీసుకుని వచ్చిందని వెల్లడించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = =

భారత్, అమెరికా రక్షణ భాగస్వామ్యంపై చర్చలను ముందుకు తీసుకెళ్లడం లక్ష్యంగా ఉండాలని ఇరు దేశాలకు చెందిన రక్షణ శాఖ అధికారులు అభిప్రాయపడ్డారు. యునైటెడ్ స్టేట్స్ ఆర్మీ పసిఫిక్ డిప్యూటీ కమాండింగ్ జనరల్, లెఫ్టినెంట్ జనరల్ జోయెల్ బి. వోవెల్, ఇంటిగ్రేటెడ్ డిఫెన్స్ స్టాఫ్ చీఫ్ ఎయిర్ మార్షల్ అశుతోష్ దీక్షిత్‌ను న్యూ ఢిల్లీలో ఈరోజు కలిశారు. సైబర్ భద్రతలో ఉత్తమ పద్ధతులను అనుసరించడం, అంతరిక్షం, సముద్ర ప్రాంతీయ భద్రతకు సంబంధించి సైనిక సహకారాన్ని బలోపేతం చేయడం గురించి ఇరుపక్షాలు చర్చించాయని ఇంటిగ్రేటెడ్ డిఫెన్స్ స్టాఫ్ ప్రధాన కార్యాలయం సామాజిక మాధ్యమం ద్వారా విడుదల చేసిన ప్రకటనలో పేర్కొంది.

= = = = = = = = = = = = = = = = = = = = = =

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఈరోజు భారీ నష్టాల్లో ముగిశాయి. సెన్సెక్స్ ఉదయం 76 వేల 863 పాయింట్ల వద్ద నష్టాల్లో ప్రారంభమై.. చివరికి 829 పాయింట్ల నష్టంతో 76 వేల 034 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 227 పాయింట్లు నష్టపోయి 23 వేల 639 వద్ద స్థిరపడింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

= = = = = = = = = = = = = = = = = = = = = = =